వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
శనివారం 25 ఏప్రిల్ 2026

ఘనంగా రాజరాజేశ్వరి సమేత అగస్తీశ్వర స్వామి కళ్యాణం

ప్రొద్దుటూరు అర్బన్,ఏప్రిల్ 24, ప్రభాత వార్త

పట్టణ నడిబొడ్డున వున్న అగస్త్యేశ్వర ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గంగా రాజరాజేశ్వరీ సమేత అగస్తేశ్వర స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవ వేడుకలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో దయం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, దీక్షా మంటప పూజలు, దీక్షా హోమాలు, నిత్యబలిహరణ, సాయంత్రం మంటప పూజలు, దీక్షా హోమాలు, నిత్య బలిహరణ స్వామి అమ్మవార్ల వార్షిక కళ్యాణ మహోత్సవం, ఆలయం లోపల మిరవణి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తాదులు వచ్చి స్వామి వారిని దర్శించి సేవించి తరించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. రమణ, ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి భద్రావతి భావన్నారాయణ స్వామి

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవములు

ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 24, ప్రభాత వార్త

స్థానిక శ్రీరామనగర్ లోని శ్రీ భద్రావతి భావన్నారాయణ స్వామి దేవాలయంలో నేడు, రేపు ప్రతిష్టా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 5:00 గంటలకు ప్రాతఃకాల పూజ, యంత్రాలకు, మూర్తులకు అభిషేకము, ఆవాహిత దేవతా హోమాలు, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం. ఉదయం 830 గంటల నుండి సాయంత 3:00 గంటల వరకు శ్రీ విజయ గణపతి, మూల మూర్తులను, నవగ్రహ, పరివార దేవతల విగ్రహాలను పురవీధుల గుండా గ్రామోత్సవం జరపనున్నామని వివరించారు. సాయంత్రం 5:00 గంటల నుండి 7:00 గంటల లోపు గోధూళికా లగ్నం నందు ధ్వజ ప్రతిష్ఠ, మూర్తులకు ధాన్యాధివాసం, మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి దిశానిర్దేశం

కడప, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

కడప సింధూర్ ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (DPM) ఎస్.వి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా పంటలకు హాని కలిగించే పురుగులు, తెగుళ్లు మరియు వాటి నివారణ చర్యలపై వివరంగా చర్చించారు. మిత్ర పురుగుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రకృతి వ్యవసాయంలో వాటి పాత్రను వివరించారు. అదనంగా జీవామృతం, ఘనజీవామృతం, వివిధ కషాయాల తయారీ విధానం, వినియోగం మరియు వాటి ప్రయోజనాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ద్వారా సిబ్బంది నేర్చుకున్న విషయాలను గ్రామస్థాయిలో రైతులకు చేరవేయాలని సూచించారు. అలాగే క్యాడర్ సభ్యుల సొంత పొలాల స్థితిగతులను పరిశీలిస్తూ, వారి ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. భూమిని 365 రోజులు పచ్చదనంతో కప్పి ఉంచే విధానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి ఆరోగ్యం, స్థిరమైన ఆదాయం మరియు మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కొత్తగా ఎంపికైన కార్యకర్తలు ఈ శిక్షణను సమగ్రంగా గ్రహించి, స్వయంగా ప్రకృతి వ్యవసాయం ఆచరిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని, గ్రామాల్లో మోడల్ ఫార్మ్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బంది నైపుణ్యాలు మెరుగుపడి, జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తరణకు దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి బీసీ బిడ్డ

కుటుంబానికి ఆర్థికసాయం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తొండూరు ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాలు కోల్పోయిన జిల్లాలోని తొండూరు బీసీ హాస్టల్ విద్యార్థి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బిడ్డ చనిపోతే కన్నతల్లి పడే వేదన వర్ణనాతీతమని, ఆ శోకం నుంచి కోలుకోవడం అసాధ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబానికి తాము ఉన్నామనే భరోసా కల్పించడానికే ఈ చిన్నపాటి ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేంపల్లి మండల కేంద్రానికి చెందిన గురు ప్రణీత్ కుమార్(11) తొండూరు బీసీ హాస్టల్ ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడన్నారు. వేసవి సెలవులు ఇవ్వడంతో, అదే హాస్టల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న అన్నయ్య, తల్లితో కలిసి ఆటోలో సొంతూరు పయనమయ్యాడన్నారు. వాటర్ బాటిల్ కొని తిరిగి వస్తుండగా, టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో గురు ప్రణీత్ కుమార్ ప్రాణాలు కోల్పోవడం బాధాకర మన్నారు. పసి ప్రాయంలోనే విద్యార్థి విగతజీవిగా మారడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఇదే విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగానే, బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారన్నారు. త్వరలోనే ఈ ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందజేస్తామని ఇన్చార్జి మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిరక్ష్యం వద్దు

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు

రాజంపేట, ఏప్రిల్ 24 ప్రభాతవా

ప్రజాదర్బార్‌లో ప్రజలతో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిరక్ష్యం వహించొద్దని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం నిరక్ష్యం కారణంగా నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివిధ సమస్యలపై ప్రజల వద్దకు వచ్చిన బాధితులు వివరించడంతో అధికారులకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తున్నామని తెలియజేశారు. అంతకు ముందు భూ సమస్యలు,పెన్షన్స్, డ్రైనేజ్ సమస్యలు, పక్కా ఇల్లు కావాలని, తదితర అంశాలపై ప్రజల నుంచి అర్జీలను చమర్తి జగన్ మోహన్ రాజు స్వీకరించారు.

నారాయణ కాలేజీ సమీపంలో

సీసీ రోడ్ పనులకు శ్రీకారం

యూజీడీ సమస్య పరిష్కారానికి చర్యలు
స్థానికులకు హామీ
కౌన్సిల్ తీర్మానం మేరకు పనులు ప్రారంభం
ప్రజల డిమాండ్లకు స్పందించిన అధికారులు

పులివెందుల ఏప్రిల్ 24 ప్రభాత వార్త :

పట్టణంలోని నారాయణ కాలేజీ సమీపంలో నివసిస్తున్న స్థానికులు సీసీ రోడ్ నిర్మాణం మరియు యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారులను కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సిల్ తీర్మానం మేరకు అక్కడ సీసీ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్థానికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. యూజీడీ సమస్యను కూడా త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇంచార్జి వైయస్ మనోహర్ రెడ్డి హామీ ఇచ్చారు. దీనితో ఈ ప్రాంత ప్రజలు సీసీ రోడ్ పనులు ప్రారంభమై నందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, యూజీడీ సమస్యను కూడా త్వరితగతిన పరిష్కరించి నందుకు మనోహర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం పనులు వేగంగా పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిలిచిపోయిన నీటి సరఫరా

దువ్వూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

జిల్లాల ప్రధాన నీటి వనరు అయిన కేసీ కెనాల్ మైదుకూరు కాలువకు శుక్రవారం నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రబి సీజన్ లో అక్కడక్కడ కేసీ కెనాల్ కింద వరి, మినుము, పెసర, నూగు, జొన్న వంటి పంటలను సాగు చేశారు. ఆ పంటల కొరకు ముందుగా మార్చి 31వ తేదీ వరకు నీరు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. అయితే పంట దిగుబడి రాదని, ఏప్రిల్ 15 వరకు నీరు ఇవ్వాలని రైతులు కోరగా అందుకు మైదుకూరు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్ లు పై అధికారులతో చర్చించి సుమారు ఏప్రిల్ 20వ తేదీ వరకు నీరు సరఫరా అయ్యేందుకు సహకరించారు. దీంతో రైతులు సాగు చేసిన పంట దిగుబడులు పూర్తి కావడంతో ప్రస్తుతం రైతులకు నీటి అవసరం లేదు. అందువల్ల పైనుంచి వచ్చే నీటిని రాజోలి వద్ద నుంచి కుందూ నదిలోకి కిందికి కేసీ కాలువ అధికారులు వదిలారు. పశువుల కొరకు కుందూ నదికి వదిలినట్లు తెలిపారు. కానీ పై నుంచి కూడా కుందూ నదిలో అంతంత మాత్రమే నీరు వస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రెండవసారి కేసీ కెనాల్ కు ఈ ఏడాది రెండవ పంటకు సమృద్ధిగా నీరు అందించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించారు. ప్రస్తుతం శుక్రవారం కేసీ కాలువలో కేవలం కొద్దిగా మాత్రమే నీరు ప్రవహిస్తుంది.

ప్రియుడితో కలిసి కిరాయి హంతకులతో

భర్తను హత్య చేసేందుకు కుట్ర..

- భర్త, ప్రియుడితో సహా సుపారీ గ్యాంగ్ అరెస్ట్ - విలేకరుల సమావేశంలో ఏఎస్పీ విభూకృష్ణ

- 2 కార్లు, రూ.5లక్షలు నగదు, మారణాయుధాలు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

తాళి కట్టిన భర్తనే చంపేందుకు కుట్ర పన్నిన భార్యతో పాటు ఆమె ప్రియుడిని ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేయడం జరిగింది. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరు మండల పరిధిలోని లింగాపురం గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తికి కురాకు శిల్పారెడ్డితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈశ్వర్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా విబేధాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో భార్య శిల్పారెడ్డి అనారోగ్యంగా ఉన్నప్పుడు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లింది. అక్కడ పని చేస్తున్న జమ్మలమడుగుకు చెందిన అటెండర్ సుధీర్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఈశ్వర్‌రెడ్డి తన భార్యను తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది. శిల్పారెడ్డి తన వద్ద ఉన్న బంగారును అమ్మి భర్తను హత్య చేసేందుకు ప్రియుడితో కలిసి కుట్ర పన్నింది. సుధీర్‌కు రాజుపాలెం మండలంలో రౌడీ షీటర్‌గా ఉన్న వినోద్ స్నేహితుడు కావడంతో అతనితో కలిసి హత్యకు కుట్రపన్నాడు. హిందూపురంలోని ముఠా లిల్లీ గ్యాంగ్‌తో కలిసి రూ.10లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో భర్త ఈశ్వర్‌రెడ్డిని నిందితులు కత్తులు, ఇనుపరాడ్లతో వెంటాడి హత్య చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకొని ప్రొద్దుటూరు 1వ పట్టణ పోలీసులను ఆశ్రయించడంతో తన ఆదేశాలతో నిందితులను అయ్యప్పస్వామి గుడి వద్ద 11 మందిని అరెస్టు చేయం జరిగిందన్నారు. నిందితుల నుంచి రూ.5లక్షలు నగదు, 2 కార్లు, 10 సెల్‌ఫోన్లు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ కేసును చేధించిన ఏఎస్పీని, సిబ్బందిని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

గుడి ముసుగులో

ప్రభుత్వ భూమి కబ్జా

- ప్రభుత్వ ధరణి పై ఆలయ ధర్మకర్త కన్ను
- భూమి ప్రభుత్వానిది షోకు ప్రైవేట్ వ్యక్తిది
- 20 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ కు రంగం సిద్ధం
- గుడి నిర్మాణానికి కూడా లేని ప్రభుత్వ అనుమతులు
- దేవుడి పేరుతో కమర్షియల్ ఆలోచనలు
- ప్రభుత్వం ఏదైనా చక్రం తిప్పే చాణక్కుడు
- కోట్ల భూమికబ్జా అవుతున్న పట్టించుకొని రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూమిని పరిరక్షి స్తామని ప్రభుత్వ పెద్దలు ఎన్ని చెప్తున్నా ప్రభుత్వ అధికారుల చేతివాటం రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ భూమి పరుల పాలు అవుతూనే ఉంది ఇది సాక్షాత్తు దేవుడు పేరుతో జరుగుతున్న కబ్జా బాగోతం పులివెందుల పట్టణంలో 20 కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని స్వామి పేరుతో కొట్టేసే ప్రయత్నం జరుగు తుంది కళ్ళు ఉన్న కబోదుల అధికారులు వివరిస్తు న్నారని విమర్శలు ఉన్నాయి.రాజకీయ నేతలు అండదండలు పుష్కలంగా ఉండడంతో ఆ నేత బరితె గింపు యాదే చ్చంగా సాగుతోంది..

పులివెందుల ఏప్రిల్ 24 ప్రభాతవార్త

పట్టణ పరిధిలోని భాకరా పురంలో ఉన్న కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని రెవెన్యూ సిబ్బంది సహకారంతో గుడి ముసుగులో కబ్జా చేసేందుకు ఒక వ్యక్తి రంగం సిద్ధం చేసుకున్న సంఘటన పులివెందుల పట్టణంలో జరుగుతోంది. భాకరపురం లోని సర్వే నంబర్ 29 లో హెలీప్యాడ్ ,క్రికెట్ స్టేడియం వంటి నిర్మాణాలు నిర్మించా రు. ప్రభుత్వం ఏదైనా చక్రం తిప్పే అపర చాణిక్యుడు. దాదాపు 15 ఎకరాల ప్రభుత్వ భూమి పై కన్నేసిన చాణిక్యుడు ఆ భూమిలో గుడి కడుతున్నామని నమ్మించి ఇదే సర్వే నంబర్ లనీ దాదాపు రెండు ఎకరాల స్థలంలో శ్రీ కృష్ణ దేవస్థానం నిర్మించారు. గుడి నిర్మాణం అయిన వెంటనే కళ్యాణ మండపం పేరుతో మరో మూడు ఎకరాలు చదును చేసి నిర్మాణ పనులు చేపట్టారు. దానికి అనుకోని ఎకరా రెండు కోట్ల విలువ చేసే మొత్తం 10 ఎకరాల భూమిని గుడి ముసుగులో సొంతం చేసుకునేందుకు భూమిని చదును కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయి.దాదాపు 20 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని హస్త గతం చేసుకోవడం కోసం చాణక్కుడు తన ప్రణాళికను అమలు చేస్తున్నాడు అన్న విషయం మరి కొని రోజుల్లో అందరికీ అర్థం అవుతుంది. ప్రభుత్వాలు మారిన ఆ చాణక్కుడు తన చక్రం తిప్పుతూ ఉండటం అతని ప్రత్యేకత .అయితే గుడి నిర్మాణానికి కూడా అనుమతులు లేవు అన్నది అందరిని ఆశ్చర్యపరిచే అంశం. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్న అడ్డుకోవాల్సిన రెవిన్యూ అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. అడ్డుకోవాల్సిన రెవిన్యూ శాఖ యంత్రాంగం ఆ శాఖలోని కొంతమంది సిబ్బంది సహాయ సహకారాలు బాగా అందిస్తున్నట్లు సమాచారం. ఈ కబ్జాపై ఇప్పటికే రెవెన్యూ అధికారుల దృష్టికి ఫిర్యాదులు వెళ్లిన అపరచానికుడు అధికార ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు కూడా చేసేది ఏమీ లేక అస్త్ర సన్యాసం తీసుకున్నట్లు తెలిసింది. అదే ఒక పేదవాడికి ప్రభుత్వం గృహ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన ఆర్థిక పరిస్థితులు బాగలేక కట్టుకోలేక పోతే ఆ స్థలాన్ని కూడా ఎవరికైనా అవసరమైతే మాన్యాలు తీసుకుని రెవిన్యూ సిబ్బంది అనుమతులను కూడా రద్దుచేసి అప్పచెప్పిన సంఘటనలు కోకొల్లగ జరిగాయి. కానీ ఒక ప్రముఖుడు కబ్జా చేస్తే కోట్ల విలువైన భూమినైనా సరే అనుమతులు లేకపోయినా రెవెన్యూ అధికారులు మాకెందుకు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి గుడి ముసుగులో జరుగుతున్న భూ కబ్జాను రెవెన్యూ సిబ్బంది అడ్డుకోవాలి అని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కబ్జాను అడ్డుకోకపోతే దీనిని సాకుగా చూపి పులివెందుల పట్టణ పరిధిలోని ఎక్కడా కూడా ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి లేకుండా కబ్జా గురై అవకాశం ఉంది.

గుడి ముసుగులో కబ్జాకు గురవుతున్న భూమి ఇదే

గుడి నిర్మాణానికి కూడా అధికార అనుమతులు లేవు

భాకరాపురంలోని సర్వే నెంబర్ 29లో కబ్జాక్ గురవుతున్న ప్రభుత్వ భూమిపై ప్రతినిధి తహసిల్దార్ నజీర్ అహ్మద్ ను సంప్రదించగా శ్రీకృష్ణ టెంపుల్ నిర్మాణానికి సంబంధించి కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవని , అక్కడ కడుతున్న కళ్యాణ మండపానికి సంబంధించిన అనుమతులు లేవని అక్కడ ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారని పిర్యాదులు అందాయని దీనిపై విచారణ చే యాగ గుడి నిర్మాణానికి కళ్యాణ మండపం నిర్మాణం కోసం మరియు మరో గుడి ని ర్మాణానికి అనుమతులు కోసం కలెక్టర్ కు దరఖాస్తు చేసుకున్నారు అని తెలిసినది కానీ మాకు ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు అందలేదు అన్నారు. రెవెన్యూ అది, కారులను పంపించి స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పులివెందుల తహసిల్దార్ నజీర్ అహ్మద్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

నష్టం వాటిల్లిందని వాపోయిన బాధితురాలు ఆకుమల్లు రాములమ్మ

బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేసిన జడ్పిటిసి రవి కుమార్ రెడ్డి

వేంపల్లె: ఏప్రిల్ 24 ప్రభాతవార్త

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అరటి తోట దగ్ధమై నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆకుమల్లు రాములమ్మ వాపోయింది. మండలంలోని గిడ్డంగివారిపల్లె గ్రామానికి చెందిన ఆకుమల్లు రాములమ్మ కు వేముల మండలం, మీదిపెంట గ్రామంలో ఉన్న 3 ఎకరాల పొలంలో అరటి చెట్లు నాటింది. తొలికాపు పంట చేతికి వచ్చే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో అరటి గెలలు పూర్తిగా కాలిపోయాయి. అరటి గెలలతో పాటు డ్రిప్ పరికరాలు, పైపులు కూడా పూర్తిగా కాలిపోయాయి. అరటి పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో బాధితురాలు ఆకుమల్లు రాములమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై వేంపల్లె జడ్పిటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి స్పందించారు. ప్రభుత్వం వెంటనే బాధితురాలు ఆకుమల్లు రాములమ్మ ను ఆదుకొని నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టిడిపి నేతల సమిష్టి కృషితో బ్రిడ్జి నిర్మాణం చేపడుతాం

సిద్ధవటం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

సిద్ధవటం మండలం మాచుపల్లి గ్రామం పెన్నానది వద్ద శుక్రవారం టిడిపి నాయకులు మాట్లాడుతూ 2023లో యువగళం పాదయాత్రలో సమయంలో మాచుపల్లి ఖాదర్ బంగ్లా పెన్నానదిపై పార్టీ అధికారం చేపట్టాక వంతెన నిర్మాణం చేపడతామని మండల ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో టిడిపి నేతల సమిష్టి కృషితో పెన్నానదిపై వంతెన నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని యువనేత రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తాత నందమూరి తారక రామారావు శంకుస్థాపన చేసిన బ్రిడ్జిని మనవడుగా నారా లోకేష్ అమలు చేస్తారని పూర్తి విశ్వాసం ఉందని ఆర్ అండ్ బి అధికారులు వంతెన నిర్మాణ పనులకు చేపట్టిందుకు 60 కోట్లతో ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారని 1988, జూలై, 6 న శంకుస్థాపన చేశారని నెల్లూరు జిల్లా వాసి జనార్దన్ రెడ్డి బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు టెండర్ దక్కించుకొని పెన్నానదిలో కొంత భాగం పిల్లర్స్ పనులు కూడా చేశారని పెన్నా నదికి వరద నీరు రావడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ చొరవ తీసుకొని మండల ప్రజలకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు విభాగపు కార్యదర్శి మల్లు వెంకటసుబ్బారెడ్డి టిడిపి రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి, మాచుపల్లి మాజీ ఉపసర్పంచ్ మునిరెడ్డి టిడిపి నేత పిచ్చిరెడ్డి ఆ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

గోపవరం గ్రామంలో ప్రత్యేక గ్రామసభ

బద్వేలు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గోపవరం గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశం స్పెషల్ ఆఫీసర్ వి. శ్రీధర్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది. గ్రామసభలో పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అంశాలతో పాటు త్రాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధం, ఉపాధి హామీ వంటి ముఖ్య విషయాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను పరిశీలించి, అధ్యక్షుల అనుమతితో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు.

దేశ సంక్షేమం, ధర్మ సంరక్షణ బీజేపీకే సాధ్యం

కాశినాయన ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

కాశినాయన మండలం బసనపల్లె,సావిశెట్టిపల్లె, బసనపల్లె ఆకులనారాయణ పల్లె, వరికుంట్ల, గంగనపల్లె గ్రామాల నుండి 30 కుటుంబాలు బిజెపి కాశినాయన మండల అధ్యక్షుడు బిజివేముల నారాయణ రెడ్డి,భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుసిరెడ్డి మనోహర్ రెడ్డి,బిజెపి మండల ఉపాధ్యక్షుడు ఎదురు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భారతీయ జనతా పార్టీలో చేరారు . జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మన ఊరు మనకు జెండా కార్యక్రమంలో భాగంగా బసనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బిజెపి జెండానా ఆవిష్కరించారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బిజెపి మండల నాయకులు భాస్కర్ రెడ్డి, మనోహర్ రెడ్డి,నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు తామంతా కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామ పంచాయతీలో బీజేపీ అభ్యర్థులను బరిలోకి దింపి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను బిజెపి బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని నూతనంగా చేరిన కుటుంబాల సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి మల్లికార్జున రెడ్డి, ఓబీసీ మండలాధ్యక్షుడు తోడేటి మునీంద్ర యాదవ్, భాస్కరరెడ్డి,నాగార్జునరెడ్డి,ఎదురు శిరీష, షేక్ పీరావలి, ప్రతాపరెడ్డి, పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సహకారం మరువలేనిది

తొండూరు ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

మండలంలోని హైటెన్షన్ లైన్ల ఏర్పాటు విషయంలో రైతుల సహకారం మరువలేనిదని రెసోనియా కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. కడప జిల్లాలోని తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో పలు గ్రామాల మీదుగా కడప సీకేదిన్నె వరకు విద్యుత్ ట్రాన్స్మిషన్ హైటెన్షన్ స్థంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని రైతులు తమ భూములను స్వచ్ఛందంగా లీజుకు ఇచ్చారు. లీజుకు ఇచ్చిన రైతులకు పరిహారాన్ని ప్రభుత్వం ద్వారా అందుతుంది. ఆ పరిహారానికి సంబంధించిన చెక్కులను సంబంధిత రైతులకు రెసోనియా కంపెనీ ప్రతినిధులు అంచేశారు. రైతులు కేవలం అన్నదాతలే కాకుండా చీకటిని ప్రారదోలే వెలుగుదివిటీలుగా మారారని కంపెనీ ప్రతినిధులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సంతోష్, యస్వంత్, రాజ్‌కుమార్, ప్రియరంజన్ త్రిపాఠిలు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతమే లక్ష్యం: చమర్తి జగన్ మోహన్ రాజు

నందలూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా ప్రతి కార్యకర్త కట్టుబడి పని చేయాలని తెదేపా రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నందలూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అధికార దుర్వినియోగం, భూ ఆక్రమణలు, అరాచకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మేడా సోదరులు సహా పలువురు వైసీపీ నాయకుల అక్రమాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మండల, గ్రామ స్థాయిలో నాయకుల మధ్య సఖ్యత పెరిగితేనే పార్టీ లక్ష్యాలను సాధించగలమన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య, సింగిల్ విండో చైర్మన్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బారాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్దుల సాగర్, మాజీ సర్పంచు జంబు సూర్యనారాయణతో పాటు టిడిపి నాయకులు, గ్రామ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

సుండుపల్లె, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

వాతావరణ పరిస్థితులు ప్రభావంతో అధిక శాతం ఉష్ణోగ్రత ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కార్యక్రమంలో భాగంగా 24 వతేది స్థానిక రైతు సేవ కేంద్రం రెడ్డి వారి పల్లి నందు రైతు సేవ కేంద్రం సిబ్బందికి విహెచ్ఎ విఎఎలకు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయ విధానము ద్వారా అమలవుతున్న పీఎండీఎస్ విధానంలో భూమిని 365 రోజులు పలు రకాల పంటలతో కప్పి ఉంచడం గురించి మరియు విత్తన గుళికలు తయారీ గురించి ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో బెట్టను తట్టుకొని రైతుకు ఆదాయం పొందే విధానం గా సన్నద్ధం కావాలని ఇంతే కాకుండా రైతులకు 20 సెంట్లు స్థలములో నిరంతర ఆదాయం 365 రోజులు ఆదాయం పొందే మార్గాలలో భాగంగా ఏటీఎం ఏ గ్రేడ్ మోడల్ అదేవిధంగా డిఆర్పియం మోడలు హాఫ్ మూన్ మోడల్ పై మొదటి రోజు శిక్షణ ఇవ్వడం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీ మహబూబ్ భాషా తెలియజేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఒక్క రైతు దగ్గరికి ప్రకృతి వ్యవసాయ విధానం తీసుకెళ్లాలని మండలంలో పనిచేసే ఐ సి ఆర్‌పిలు ఎఫ్ఎమ్టీలు టిఐసి ఆర్‌పిలు సచివాలయ సిబ్బందితో సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలపడం జరిగినది ఈ కార్యక్రమంలో విహెచ్ఎలు రైతులు పాల్గొనడం జరిగినది.

న్యాయవాదులందరూ తమ వృత్తిపర బాధ్యతను విధిగా పాటించాలి

(ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అందించే సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా సరిచూసుకోవాలి-కొటేషన్ల కాపీ చేయడంపై ఆధారపడకూడదు

- లీగల్ డ్రాఫ్టింగ్ యొక్క కళ దెబ్బతింటోంది- ఏ.ఐ.తో నకిలీ తీర్పులను ఉటంకించడంపై సుప్రీం కోర్టు ఆందోళన)

బద్వేలు లీగల్, ఏప్రిల్24 ప్రభాతవార్త:

న్యాయవాదులు తమ పిటీషన్ల రూపకల్పనలో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్)ను ఉపయోగిస్తూ ఉనికిలో లేని ఫేక్ సైటేషన్స్‌ను కోర్టుకు సమర్పించడంపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర హెచ్చరికలను జారీ చేసింది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ సాయంతో రూపొందించిన పిటీషన్లను న్యాయస్థానాలకు సమర్పించే వైఖరి న్యాయవాదుల్లో ప్రబలడంపై ధర్మాసనం తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ విధంగా వ్రాసిన పిటీషన్లలో ఏ న్యాయస్థానము ఎక్కడా వెలువరించని తీర్పులను ఉటంకిస్తున్నారని దేశ అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం పేర్కొనింది. కొందరు న్యాయవాదులు తమ పిటీషన్లు వ్రాసేందుకు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ సాధనాన్ని వినియోగించడం ప్రారంభించారని ఇది పూర్తిగా అసంబద్ధమని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజకీయ ప్రసంగాలకు మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ రూప్‌రేఖా వర్మ అనే విద్యావేత్త దాఖలు చేసిన పిల్ పై ఛీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ బి.వి. నాగరత్నలతో కూడిన ధర్మాసనం విచారించింది. "కొంతమంది న్యాయవాదులు పిటీషన్లు డ్రాఫ్ట్ చేయడానికి ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ టెక్నాలజీని సాధనంగా వినియోగిస్తున్నారని తెలిసి తామెంతో దిగ్భ్రాంతికి గురయ్యామని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు." అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. అలాగే న్యాయస్థానంలోకూడా ఇలాంటివే వరుసగా అనేక నకిలీ తీర్పులను ఉటంకించిన ఉదంతం జరిగిందని జస్టిస్ దీపాంకర్ దత్త గుర్తు చేశారు. ఇటీవల ఓ కేసులో "మెర్సీ వర్సెస్ మ్యాన్‌కైండ్" అనే తీర్పును ఉటంకించారని అసలు అటువంటి తీర్పు చరిత్రలో ఎప్పుడూ లేదని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

అలాగే మరో ప్రమాదకరమైన ధోరణిని జస్టిస్ నాగరత్న వెలుగెత్తి చూపారు. "కొన్నిసార్లు తీర్పు పేరు (సైటేషన్) సరిగానే వున్నప్పటికీ, అందులో లేని అంశాలను లేదా కొటేషన్లను ఆ తీర్పులో వున్నట్లుగా తప్పుగా పేర్కొంటున్నారని, దీనివల్ల న్యాయమూర్తులను అదపు భారం పడుతుంది" అని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. కాగా గతంలో అశోక్ కేమార్ సేన్ వంటి ధిగ్గజ న్యాయవాదులు అత్యంత ఖచ్చితత్వంతో స్పష్టంగా పిటీషన్లు వ్రాసేవారని జస్టిస్ భాగ్చీ గుర్తుచేశారు. కానీ ఇప్పుడున్న న్యాయవాదుల్లో చాలామంది కేవలం ఇతర తీర్పులనుండి కొటేషన్లు కాపీ చేయడంపైనే ఆధారపడుతున్నారని, దీనివల్ల న్యాయపరమైన ముసాయిదా లేదా చట్టబద్ధమైన దస్తావేజుల రచన లేదా లీగల్ డ్రాఫ్టింగ్‌ల కళే దెబ్బతింటోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల బాంబే హైకోర్టు ఇలాంటి ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత నకిలీ తీర్పులను సమర్పించినందుకు గాను ఒక పిటీషనరుకు జరిమానా విధించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మరియు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కూడా గతంలో చాట్ జీపీటి వంటి ప్లాట్‌ఫాంలపై ఆధారపడటం ప్రమాదకరమని అవి తప్పుడు సమాచారాన్ని ఇస్తాయని హెచ్చరిస్తూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ అందించే సమాచారాన్ని గుడ్డిగా నమ్మవద్దని సరిచూసుకోవాలని కొటేషన్లు కాపీ చేయడంపైనే ఆధారపడకుండా లీగల్ డ్రాఫ్టింగ్‌ను అత్యంత ఖచ్చితత్వంతో స్పష్టంగా వ్రాయునటుల అత్యంత శ్రద్ధ చూపాలని వ్యాఖ్యానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కేసు నమోదు చేసిన ఎస్ఐ హారిక

సిద్ధవటం ఏప్రిల్ 24 ప్రభాతవార్త

కడప చెన్నై జాతీయ రహదారి గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు మండలంలోని మాధవరం గ్రామంలోని పార్వతిపురం నాగలికట్ట వద్ద లారీ ఢీకొట్టడంతో నాగేశ్వరరెడ్డి(40) మృతి చెందాడు ముమ్మడి గుంటపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన శ్రీను ద్విచక్ర వాహనం తీసుకొని చాముండేశ్వరిపేట సమీప ప్రాంతంలో ఉన్న పెట్రోల్ బంకులో పెట్రోలు తీసుకొని ద్విచక్ర వాహనంలో వెళుతుండగా రాజంపేట వైపు నుండి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతుండిన నాగేశ్వర్ రెడ్డి తలకు బలమైన గాయాలు తగిలి రక్త గాయాలతో రోడ్డుపై పడిపోయినాడు. నాగేశ్వర్ రెడ్డి కుమారుడు శివసాయిరెడ్డికి ఎడమ చేయికి గాయాలు అయ్యాయి. మృతుడు నాగేశ్వర్ రెడ్డి కి తలకు బలమైన గాయాలు తగలడంతో ప్రైవేటు వాహనంలో మెరుగైన వైద్య సేవలకు కడప రిమ్స్ వైద్యశాలకు తరలింపు చేస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శవ పంచనామా నిమిత్తం మార్చురీకి తరలింపు చేశారు. మృతుని తమ్ముడు లక్ష్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబు కంటే పెద్ద వెన్నుపోటుదారుడు బీటెక్ రవి

- రైతుల సమస్యలపై స్పందన శూన్యం
- సాగునీటి నిర్లక్ష్యం, రైతులకు ఇవ్వని పరిహారం
- రైతుల కోసం లక్షలు ఖర్చుచేసిన వైయస్ కుటుంబం
- బిటెక్ వ్యాఖ్యలపై లింగాల వైసీపీ నేతల మండిపాటు

పులివెందుల ఏప్రిల్ 24, ప్రభాతవార్త :

సీఎం చంద్రబాబు కంటే పెద్ద వెన్నుపోటుదారుడు బీటెక్ రవి అని అధికారంలో ఉండి రైతుల సమస్యలపై స్పందించినది శూన్యం అని సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం, నష్టపోయిన రైతులకు పరిహారం కూడా ఇప్పించలేకపోయిన బీటెక్ రవి రైతుల కోసం లక్షలు రూపాయలు సొంత నిధులను ఖర్చు చేసే వైయస్ కుటుంబ సభ్యులను విమర్శించే అర్హత లేదనీ లింగాల మండల వైసీపీ నాయకులు మండల కన్వీనర్ అంబకపల్లి బాబురెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సారధి చంద్రశేఖర్ రెడ్డి తదితర నాయకులు మండి పడ్డారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో వారు మాట్లాడుతూ టీడీపీ 2014 నుంచి ఇప్పటి వరకు 7 ఏళ్ల అధికారంలో ఉన్నా, రైతుల కోసం ఏమి చేశారో, ఈ పులివెందులకు ఏమి వెలగబెట్టారో బీటెక్ రవి సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు. గండికోట ప్రాజెక్టు 25 టిఎంసి లకు పెంచి తద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎత్తి పోతల ద్వారా నీరు తెచ్చిన ఘనత మరియు పులివెందుల ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత వైయస్ కుటుంబానిదే కాదా అన్నారు. మొన్నటికి మొన్న బియాండ్ తాతిరెడ్డిపల్లి పంప్ హౌస్ వద్ద ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులకు గురి అయితే పట్టించుకున్న పాపాన పోలేదు, ఎంపీ ట్రాన్స్ఫార్మర్ తెస్తే దానికి కనెక్షన్ ఇచ్చి రైతులకు నీళ్లు ఇవ్వడాన్ని కూడా రాజకీయం చేసి చివరకు రైతులు ధర్నా చేస్తాం అంటే తప్ప దానికి కనెక్షన్ ఇచ్చిన పాపాన పోలేదు, ఇంతకంటే నువ్వు అడిగే సాక్ష్యం ఏముందని ఇది మీ నీచ రాజకీయాలకు నిదర్శనం అన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని నిరసనలు చేసినా శనగ రైతులకు భీమా చెల్లించకపోతే 2019 లో జగన్ అధికారంలోకి రాగానే జిల్లా రైతులకు పంట భీమా అందించడం మర్చిపోయావా అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఏ తప్పు చేయకపోయినా మా పార్టీ వారిపై అక్రమకేసులు పెట్టి జైళ్లకు పంపే నీకు అధికారాన్ని వినియోగించి పాడైపోయిన మోటార్ లను మరమ్మత్తులు చేయించలేని దుస్థితి లో మీ పాలన కొనసాగుతోందిన్నారు. వివేకా హత్యకేసులో సుప్రీమ్ కోర్టు లో అవినాష్ రెడ్డి కి క్లీన్ చిట్ లభించిన, ఇదే కేసు అడ్డుపెట్టుకుని నువ్వు, షర్మిలమ్మ జిల్లా అంత తిరిగి ఓటమి పాలైన ఇంకా పదే పదే వివేకా హత్యకేసు గురించి మాట్లాడుతూ రాజకీయంగా పబ్బం గడుపుకోవడం ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన కుటుంబం కాబట్టి వైయస్ కుటుంబం రైతుల బాధ, ఆవేదనను గుర్తించి కష్టాల్లో ఉన్న రైతన్నను ఆదుకోవడం కోసం స్వంత నిధులు పెట్టడానికి కూడా వెనుకాడటం లేదన్నారు. ఇకనైనా నీచ రాజకీయాలు మానుకొని రైతులకు చిత్తశుద్ధితో మంచి చేసే ఆలోచన బీటెక్ రవి చేయాలని హితవు పలికారు ఈ కార్యక్రమం లో లింగాల మండల కన్వీనర్ బాబు రెడ్డి, రైతు విభాగం అధ్యక్షులు చంద్రశేఖర రెడ్డి, మురారిచింతల మాజీ సర్పంచ్ బాబా హుస్సేన్, గుణకణపల్లి మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, వైసీపీ నాయకులు నాగేంద్ర రెడ్డి, భూపాల్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి మరియు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు

సిద్ధవటం ఏప్రిల్ 24 ప్రభాతవార్త

శ్రీ నలంద ఉన్నత పాఠశాల స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించామని పాఠశాల ఏవో వెంకటేష్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా డాక్టర్ వీర సుదర్శన రెడ్డి,ప్రిన్సిపల్ ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజ్ కడప విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ మనసు,హృదయం,శరీరం ఈ మూడింటిని కేంద్రీకృతం చేసి విద్యను అభ్యసిస్తే మంచి ఉన్నతిని సాధించవచ్చునని ఈ మూడింటిని విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి విద్యను బోధించాలో చర్చించుకుని నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తామని తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ బాలు గారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం ఐఐటి కాలిగ్రఫీ మొదలైన రంగాల్లో విద్యార్థులు నేషనల్ లెవెల్, డిస్టిక్ లెవెల్, జోనల్ లెవెల్ లో 27 బహుమతులు మన విద్యార్థులు సాధించారన తెలిపారు. అనంతరం బహుమతులను వీర సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్స్ డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి షరీఫ్,శిల్ప, అక్షర స్కూల్ కరస్పాండెంట్ బాబు, ఎస్వీ బీవీడీ సభ హై స్కూల్ కరస్పాండెంట్ మధుసూదన మరియు తెలుగు సినిమా యాక్టర్ పొదిలి వెంకటేష్ విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీజల్ కొరతతో స్తంభించిన రవాణా వ్యవస్థ



ముద్దనూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త;

గత మూడు రోజులుగా డీజిల్ కొరత తీవ్ర సవాలుగా మారడంతో మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో వాహనదారులకు జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. ప్రధానంగా రవాణా రంగంపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముద్దనూరు మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై బెంగళూరు,చెన్నై కి నిత్యం వందలాది లారీలు, భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అయితే స్థానిక బంకుల్లో డీజిల్ నిల్వలు లేకపోవడంతో లారీలు రోడ్డు పక్కనే ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో సరుకులు చేరకపోవడంతో వ్యాపారులు నష్టపోతుండగా, అటు డ్రైవర్లు బంకుల వద్దే పడిగాపులు కాస్తున్నారు.రవాణా ఖర్చులు పెరుగుతాయన్న సాకుతో కొన్ని చోట్ల వస్తువుల ధరలు,నిత్యావసర సరుకులు పెంచే ప్రమాదం ఉందని కావున ప్రభుత్వం స్పందించి డీజల్ కొరత లేకుండా చేయాలనీ వాహనదారులు,ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం
గ్రామసభలు ఏర్పాటు

సిద్ధవటం ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారం కొరకై కృషి చేస్తానని పెద్దపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఆకుల తిరుమలబాబు అన్నారు మండలంలోని బాకరా పేట గ్రామ సచివాలయంలో శుక్రవారం పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా గ్రామ సభ ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ ఆకుల తిరుమల బాబు మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రత వల్ల నీటి ఎద్దడి పరిష్కారం కొరకు చొరవ చూపుతానని తెలిపారు గ్రామంలో పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్, టిడిపి పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య టిడిపి యువనేత ప్రతాప్ నాయుడు నరసింహారెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య పంచాయతీ సెక్రెటరీ సుధీర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



పార్టీ శిక్షణ తరగతులకు
హాజరైన ఆకుల. కృష్ణయ్య

మైదుకూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు కేంద్ర కార్యాలయం మంగళగిరిలో జరిగే పార్టీ క్లస్టర్ ఇన్చార్జిల శిక్షణ తరగతులకు మైదుకూరు నియోజకవర్గంలోని మైదుకూరు పట్టణ మున్సిపాలిటీ క్లస్టర్ ఇన్చార్జులు ఆకుల కృష్ణయ్య మరియు పందిటి పెద్దయ్య పాల్గొన్నట్లు తెలిపారు. మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు రెండు రోజులపాటు కేంద్ర కార్యాలయం మంగళగిరిలో జరగబోయే పార్టీ క్లస్టర్ ఇన్చార్జిల శిక్షణ తరగతులకు నియోజకవర్గంలోని పలువురు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను
విజయవంతం చేయాలి

రాజంపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

కార్పొరేట్ లాభాల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, షెడ్యూల్డ్ రంగాల్లో పనిచేస్తున్న సుమారు 50 లక్షల మంది కార్మికులకు గత 15 సంవత్సరాలుగా జీతాల్లో ఎలాంటి పెరుగుదల లేదని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్ విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచకుండా, జీవితాంతం పనిచేసినా పర్మినెంట్ చేయకుండా, పెన్షన్ ఇవ్వకుండా, ఉన్న జీతాలను కూడా తగ్గించే విధానాన్ని అనుసరిస్తోందని ఆయన విమర్శించారు. ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులను బానిసల్లా పనిచేయించే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.శుక్రవారం రాజంపేటలోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ, నేడు కార్మిక వర్గం ఎన్నడూ లేనివిధంగా దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.రాబోయే ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిగేట ముజుఫర్, ఏఐటీయూసీ నాయకులు రమణ, సురేష్, కోవేట్ల, వీరేష్, సిద్ధయ్య, లోకేష్, ఆకాష్, పి. రమణ, అంకయ్య, బాలయ్య, శంకరయ్య, రమేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభల గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న సికిందర్, తదితరులు

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

కలికిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

కలికిరి మండలంలోని రూరో అర్బన్ గ్రామ పంచాయతీలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి మరియు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎం.మహ్మద్ రియాజుద్దీన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామీణాభివృద్ధికి పునాది అని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలు, అవసరాలు నేరుగా పరిష్కారం దిశగా తీసుకెళ్లవచ్చని, ప్రతి ఒక్కరూ గ్రామసభల్లో పాల్గొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు బలమైన చట్టపరమైన పునాది 73వ రాజ్యాంగ సవరణ చట్టం, 1992 ద్వారా ఏర్పడింది. ఇది గ్రామ ప్రజలకు స్వయంపాలన హక్కును అందించి అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీవో) ఎ.అశోక్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పారదర్శకత, బాధ్యతాయుత పాలన చాలా ముఖ్యమని పేర్కొన్నారు. పరిపాలనాధికారి (ఏవో) సురేంద్ర బాబు మాట్లాడుతూ పన్నులు సకాలంలో చెల్లింపు ద్వారా గ్రామ పంచాయతీల ఆర్థిక స్థితి బలపడుతుందని, అందరూ తమ వంతు బాధ్యతగా పన్నులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో (జీఎస్‌డబ్ల్యూఎస్), సి.వినయ్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్స్, స్వర్ణ గ్రామ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.అరుంధతి, ఎస్.రెడ్డి, సార్థజ్ బేగం, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి

వేంపల్లె : ఏప్రిల్ 24 ప్రభాతవార్త

విద్యార్థులకు పాఠశాలలో ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని ఇంచార్జి మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలోని విజయభారతి పాఠశాలలో కాన్వకేషన్ కార్యక్రమం నిర్వహించామని కరస్పాండెంట్ మేడా ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, గండి క్షేత్రం శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు పచ్చిపులుసు మురళీ కిషోర్, ఉపాధ్యక్షులు బైరిశెట్టి బాల గంగాధర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరి ప్రసాద్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని సంపదల్లో విద్యా సంపద ప్రధానమైనదని తెలిపారు. విద్యా సంపదను తమ బిడ్డలకు అందించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలతో పాటు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన సంస్కారవంతమైన, నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. మానవ జీవితంలో విద్యార్థి దశ స్వర్ణ యుగం లాంటిదని తెలిపారు. ఈ దశను ఏ విద్యార్థి అయితే సద్వినియోగం చేసుకుంటాడో అతడు కచ్చితంగా జీవితంలో రాణిస్తాడని అన్నారు. విజయభారతి పాఠశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉందని దానికి తగ్గట్టుగా విద్యార్థులు కూడా విద్యను నేర్చుకోవాలని కోరారు. సామాజిక బాధ్యతలు కూడా విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. గురుకుల విద్యా బోధన పద్ధతిలో, క్రమశిక్షణతో కూడిన, సంస్కారవంతమైన, నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు 50 రోజుల పాటు వేసవి సెలవులు ఉంటాయాని ఈ వేసవి సెలవుల్లో కూడా విద్యార్థులు ప్రకృతి నుండి విద్యను అభ్యసించాలని రాచినేని శ్రీనివాసులు ఉద్బోధించారు. వేసవి సెలవుల్లో కుంటలు, చెరువుల వద్దకు వెళ్లి ప్రాణాలకు మీదకు తెచ్చుకోవద్దని తెలిపారు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, ఆకాశము, భూమి, జంతువులు, పక్షులు, ఇలా ప్రకృతిలో ప్రతి ఒక్కటీ ఒక ఉపాధ్యాయునితో సమానమని వీటి నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చున్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను, మెడల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత ఆది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ విభాగం

వేంపల్లి: ఏప్రిల్24 ప్రభాతవార్త

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ పులివెం దుల ఇంచార్జ్ డాక్టర్ హరీష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ అగ్రగామిగా ఉన్నందుకు నేను చాలా గర్వపడుతున్నాను. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శా ఖ మంత్రిగా పంచాయతీరాజ్ ను నెంబర్ వన్ రేసులో మన ఆంధ్రప్రదేశ్ పం చాయతీరాజ్ను తీర్చిదిద్దడంలో జనసేనాని చాలా కష్టపడ్డారు అని ఆయన మా ట్లాడారు. తదనంతరం పవన్ కళ్యాణ్ సేవల గురించి మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి, స్వావలంబన దిశగా అడుగులు, ఫలితాన్నిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రణాళికలు, గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లోనూ నంబర్ వన్ స్థానం, సంస్కరణలతో వ్యవస్థల బలోపేతం, పారదర్శక విధానాలతో పల్లె ల్లో అభివృద్ధి వెలుగులు, పల్లె ప్రగతే పంచాయతీరాజ్ దినోత్సవానికి అసలైన నిదర్శనం అంటున్న ప్రజలు. ఈ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన కూ టమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిలో ఒక చారిత్రాత్మక దశకు చేరువయ్యింది. గ్రామాలకు నిర్మిస్తున్న రోడ్లతో స్వయం సమృద్ధ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నా మన్న పవన్ కళ్యాణ్ ఆలోచనలు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రగతి పథంలో అగ్రగామిగా నిలుపుతుంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులుసుధీర్ రెడ్డి, దేవా, మనోజ్, సాయి, తేజ, శ్యామ్, మల్లేష్, మల్లి, శ్రీను, పట్టం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకు నీచ రాజకీయాలు

దమ్ముంటే వైఎస్ జగన్‌పై నేరుగా యుద్ధం చేయగలవా?

సిఎం చంద్రబాబుపై సతీష్ రెడ్డి నిప్పులు

వేంపల్లె: ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దృష్టి మళ్లించేందుకు టిడిపి కూటమి నాయకులు నీచ, చిల్లర రాజకీయాలకు తెర లేపారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి నేతలు తప్పుడు విధానాల అజెండాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పెద్ద దస్తగిరి ని హత్య చేయాల్సిన అవసరం వైసిపి నేత నిత్యానంద రెడ్డికీ ఏముందని ప్రశ్నించారు. పెద్ద దస్తగిరి కుమారుడు చాలా క్లియర్ గా పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదు పట్టించుకోకుండా ఈనాడు నీచ కథనాలు ప్రచురిస్తోందని మండిపడ్డారు. ఎల్లో పత్రికలు ఎక్కడ పోతున్నాయి.. ఏమి రాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి, వైఎస్ జగన్మోహన్ రెడ్డికి లింక్ పెడుతూ తప్పుడు కథనాలు అల్లుతున్నారన్నారు. వయసు పెరిగే కొద్దీ చంద్రబాబు నీచంగా మాట్లాడుతున్నట్లు తెలిపారు. మాట్లాడే సమయంలో తన హోదా, స్థాయి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై నిందలు వేయడానికి చంద్రబాబుకు సిగ్గు లేదా! అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలెంటి? ఎన్నికల తర్వాత చేస్తుందేంటి అని సూటిగా సమాధానం చెప్పాలన్నారు. రాజధాని ముసుగులో చంద్రబాబు ప్రజాధనాన్ని దోచుకుంటున్నట్లు ఆరోపించారు. మావిగన్ ఉపయోగాలు, జగన్ విజన్ ప్రజల్లోకి స్పష్టంగా వెళ్లిందన్నారు. చంద్రబాబు తప్పులు, ఆ దేవుడు లెక్కిస్తున్నాడని అన్నారు. ఇకనైనా టిడిపి మంత్రులు చౌకబారు ప్రకటనలు మానుకోవాలన్నారు.

శ్రీనివాసులరెడ్డిని కలిసిన డిసిసి చైర్మన్

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జోనల్ కోఆర్డినేటర్ గా నియమితులైన రెడ్డెప్పగారి శ్రీనివాసులరెడ్డిని శుక్రవారం ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జమ్మలమడుగు ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారు రాబోయే రోజులలో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూరారెడ్డిని పరామర్శించిన ఎంపీ

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 24, ప్రభాత వార్త

నియోజకవర్గంలోని అట్లూరు మండలానికి చెందిన వైఎస్ఆర్సిపి నేత సూరారెడ్డిని వైయస్ అవినాష్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకున్న సూరారెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కూడా పాల్గొని సూరారెడ్డికి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. నాయకులు ఆయనకు ధైర్యం చెప్పి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

డీఐజీగా పదోన్నతి పొందిన వెంకటరమణారెడ్డికి ఘన సన్మానం

ప్రొద్దుటూరు ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని నాలుగో వార్డు మాజీ కౌన్సిలర్ వరికూటి ఓబుల్ రెడ్డి వియ్యంకులు వెంకటరమణారెడ్డి తెలంగాణ రాష్ట్ర డీఐజీగా పదోన్నతి పొందిన సందర్భంగా ఓబుల్ రెడ్డి సమక్షంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ మా వియ్యంకులు వెంకటరమణారెడ్డి తెలంగాణ రాష్ట్ర డీఐజీగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు. తెలంగాణ ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఆయన కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రీ సర్వేని సద్వినియోగం చేసుకోండి

చిన్నమండెం ఏప్రిల్ 24 ప్రభాత వార్త:

మండలంలోని చిన్నమండెం గ్రామం లో మే 1 వ తేదీ నుండి ప్రారంభం కానున్న రీ సర్వే కార్యక్రమంపై శుక్రవారం గ్రామ పంచాయతీ సచివాలయంలో తహశీల్దార్ రామాంజనేయులు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రీ సర్వే ని సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించు కోవాలని కోరారు. రీ సర్వే ఎలా జరుగుతుంది రి సర్వే లో భూమిని ఎలా కొలతల వేస్తారు ,భూమి సమస్యలు ఉంటె ఎలా పరిష్కారం చేసుకోవాలి అన్న విషయాలపై ప్రజలకు తహసీల్దార్ వివరించారు. భూములు గురించి సమాచారం తెలుసు కోవాలి అన్న విషయాన్ని క్షుణ్ణంగా తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ నందివర్ధన్ రెడ్డి ,ఆర్ ఐ శిల్పా మండల సర్వేయర్ శ్యామల, వి ఆర్ ఓ గంగులయ్య రెవెన్యూ సిబ్బంది. మండల టీడీపీ అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప, చిన్నమండెం టీడీపీ అధ్యక్షుడు రాముతుల్లా, చెన్నకృష్ణా రెడ్డి ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి వారి వార్శికోత్సవం

రామసముద్రం ఏప్రిల్ 23 ప్రభాతవార్త

రామసముద్రం మండల కేంద్రంలోని శ్రీ కృష్ణ దేవరా యులు కాలం నాటి శ్రీలక్ష్మీ జనార్ధన స్వామి వారి వార్శికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ ఆధ్వర్యంలో అనిల్ స్వామి ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేలు కొలిపి ఆలయ శుద్ధి చేసి స్వామి వారిని వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. స్వామి వారినకి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్ధ ప్రసాధాలు అందజేశారు. ఈ లక్ష్మి జనార్ధన స్వామి వారి వార్శికోత్సవ ములో పాల్గొన్న భాస్కర్ గౌడ్, కోల హరినాథ్ రెడ్డి, గబ్బురి మధుసూదన్ శట్టి, వల్లాల దర్శన్ తదితరులు పాల్గొన్నారు

తంబళ్లపల్లెలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

తంబళ్లపల్లె ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

తంబళ్లపల్లి మండలంలో మండల పరిషత్ కార్యాలయంతో పాటు సచివాలయాలలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తంబళ్లపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థతో గ్రామపంచాయతీలు పటిష్టంగా తయారై గాంధీజీ కలలు నెరవేరుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో సమస్యలు అధికారులు దృష్టికి తెచ్చి పరిష్కారానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అంజనప్ప, కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటరమణ, సోమశేఖర్ రెడ్డి, మంజుల, పద్మావతి, భాస్కర్ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన జగన్మోహన్ రాజు

రాజంపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ అనారోగ్య కారణాలతో 24 మంది దరఖాస్తు చేసుకోగా మంజూరైన 23 లక్షల రూపాయల నిధులకు సంబంధించి చెక్కులను బాధితులకు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి చమర్తి జగన్ మోహన్ రాజు అందజేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు . పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రీయ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మని ,గ్రామీణ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్, ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి , క్లస్టర్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు ,కళాధర్, కరీం ,తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న జగన్మోహన్ రాజు

గంగమ్మ వైష్ణవీమాతలకు రాహుకాలాభిషేకాలు

చౌడేపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

రాహుకాల సమయంలో శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ, పుదిపట్ల వైష్ణవీ మాతా ఆలయాల్లో విశేషాభిషేకాలు జరిగాయి. ఆయా ఆలయాల్లో ఉదయాన్నే అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అలంకరణగావించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ముడుపులు చెల్లించారు. రాహుకాల సమయంలో పూజలో పాల్గొనడం వల్ల కుటుంబాలు, లోకం సుభిక్షంగా వుంటుందని పండితులంటున్నారు. బోయకొండలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుదిపట్లలో వైష్ణవీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

దగ్గు మాత్రమే టీబీ వ్యాధి లక్షణం కాదు

డిప్యూటీ హెచ్ఈవో మహ్మద్ రఫీ



కలికిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

దగ్గు మాత్రమే టీబీ (క్షయ)వ్యాధి లక్షణం కాదని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు టీబీ ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగామండలంలోని సత్యాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీబీ రహిత భారత్‌పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ దగ్గు ఒక్కటి మాత్రమే టీబీ వ్యాధి లక్షణం కాదని రోజూ సాయంత్రం వేళ జ్వరం రావడం, గల్లతో కూడిన దగ్గు, ఒక్కోసారి గల్లలో రక్తం కనబడడం, అలసట, నీరసం, రాత్రివేళ చమటలు పట్టటడం, బరువు తగ్గుతుండడం, ఛాతిలో నొప్పి, ఆకలి లేకపోవడం, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పు, ఏదైనా శరీర భాగంలో గుల్లలు, వాపు రావడం, గతంలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఇవన్నిటిలో ఏవి కనిపించినా క్షయ వ్యాధి అని అనుమానించి దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల్ల పరీక్షలు, ఛాతి ఎక్స రే తీయించుకోవాలి. ఇప్పుడు టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 104 సేవలలో కూడా గ్రామాల్లో అక్కడికక్కడే అనుమానిత రోగులకు ఛాతి ఎక్స రేలు తతీయడం జరుగుతుంది. ఈ వ్యాధి పట్ల సమాజంలోని సామాజిక కలంకంను పార్రద్రోలి అందరూ టీబీ లేని సామజ స్థాపన లక్ష్యం సాధనకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ, సీనియర్ ఏఎన్ఎం నఫీసా, ఆశా కార్యకర్త యశోద, అంగన్‌వాడీ టీచర్ అవని, సంపూర్ణ, తల్లులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసనలు



మదనపల్లె, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

మున్సిపల్ డైలీవేజెస్ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల పట్ల శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 నవంబర్ నెల నుంచి 2026 ఫిబ్రవరి వరకు మున్సిపాలిటిలో డైలీ వేజెస్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ వేతనాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతినెలా వేతనాలు సకాలంలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు మస్తాన్, జిల్లా కార్యదర్శి దేవా, తిరుమల, ఇంద్రాణి, జానకి, శంకరమ్మ, అన్నపూర్ణ, చంద్రమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ

మదనపల్లె క్రైమ్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త.

మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా శనివారం మదనపల్లి పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. లక్ష్మీనరసయ్య, జిల్లా మలేరియా అధికారి ఆర్. రామచంద్రారెడ్డి లు తెలిపారు. శుక్రవారం మదనపల్లిలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మలేరియా విభాగం సిబ్బందితో కలిసి వారు ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలు (కరపత్రాలు), బ్యానర్లను ఆవిష్కరించారు. శనివారం ఉదయం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం నుండి ఈ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్. ఖలీల్ వుల్లఖాన్ నాయక్, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, కె. గంగయ్య గౌడ, కె. సురేంద్ర, జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు శివ, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మృతి చెందిన ఉపాధ్యాయుడు టేకూరి వెంకటేశ్వర్లు

లక్కిరెడ్డిపల్లి: ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ఉపాధ్యాయుడు టేకూరు వెంకటేశ్వర్లు (58) (ఫైల్ ఫోటో)

మండల పరిధిలోని పర్వత రెడ్డి గారి పల్లె పంచాయతీ భిన్నమైన పల్లెకు చెందిన ఉపాధ్యాయుడు టేకూరి వెంకటేశ్వర్లు (58) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు చిన్నమండెం మండలంలోని నడిగడ్డ పల్లె ప్రాథమిక పాఠశాలలో ఎస్జిటి ఉపాధ్యాయునిగా పనిచేసేవారు. అయితే నిన్నటి నుంచి వేసవి సెలవులు కావడంతో ఇంటి దగ్గరే ఉన్న సమయంలో ఉదయం 10 గంటల ప్రాంతంలో ఛాతిలో నొప్పి రావడంతో ఇంటి దగ్గరే ఉన్న తన భార్య, కూతురుతో చెప్పగా వెంటనే వారు తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఈయన మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. నేడు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి అంత్య క్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నివాళులర్పించారు.

పరిపాలనలో పారదర్శకత అవసరం

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

గ్రామసభలో ప్రసంగిస్తున్న గఫూర్

చౌడేపల్లి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించినప్పుడే మహాత్మాగాంధీ స్వప్నం గ్రామస్వరాజ్యం వస్తుందని తహశీల్దార్ భూపతి పార్వతి, డిఎంపిడిఒ ఎస్ఎ.గఫూర్‌లు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా గల స్వర్ణగ్రామాల్లో ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. ఆమినిగుంట, ఎ.కొత్తకోట, దుర్గ సముద్రం స్వర్ణగ్రామంలో గ్రామసభల్లో వారు ప్రసంగిస్తూ స్థానిక స్వపరిపాలనల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, పంచాయతీలను బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. అనంతరం పంచయతీరాజ్ ఏర్పడిన తీరు, రాజ్యాంగంలో 73వ రాజ్యాంగ సవరణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆయా స్వర్ణగ్రామాలకు చెందిన ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయితీ అభివృద్ధి అధికారులుగా ముగ్గురు

తంబళ్లపల్లె ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

తంబళ్లపల్లి మండలంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీల ఇంటి పన్ను వసూలు, మౌలిక సదుపాయాల కల్పనలో ముగ్గురు పంచాయతీ ఉత్తమ అభివృద్ధి అధికారులుగా ఎంపికైనట్లు ఉన్నతాధికారుల నుండి ఉత్తర్వులు అందాయి. తంబళ్లపల్లె పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, గోపి దిన్ని పంచాయతీ కార్యదర్శి ఎం.నాగ పద్మజ, పరస తోపు పంచాయతీ కార్యదర్శి ఎం. హరి ప్రసాద్ ల ఎంపికపై మండల పరిషత్ అధికారులు, కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, మాజీ సర్పంచులు, మాజీ వార్డ్ మెంబర్లు, ఎంపిటీసీలు, అధికార కూటమి పార్టీల నాయకులు వారు చేసిన సేవను కొనియాడుతూ హర్షం వ్యక్తం చేశారు.

కోర్టు ఆదేశాలను దిక్కరించిన రమణయ్య, సుగుణమ్మ, సుష్మిత

కలికిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

కలికిరి మండలం పత్తేగడ పంచాయతీ పరిధిలోని కొర్లకుంట రెవెన్యూ గ్రామంలో సర్వే నెం.33/4(ఎల్పీ నెం.196)లో మొత్తం 0.23 సెంట్ల విస్తీర్ణం, అలాగే 33/7,33/7ఎలో మొత్తం 0.31 ససెంట్ల విస్తీర్ణం గల భూమికి న్యాయస్థానం ఓఎస్ నెం.334/2025 ద్వారా వి.జ్యోతికి ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చింది. కోర్టు ఆదేశాలను ధిక్కరించి, తెలుగుట్టపల్లి హరిజనవాడలో నివసిస్తున్న ఎ.రమణయ్య, ఎ.సుగుణమ్మ, ఎ.సుష్మిత కలిసి పై పేర్కొన్న సర్వే నెంబర్లలోని హద్దులను తొలగించి మార్పులు చేసి తరువాత సమీపంలోని ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందువల్ల ఈ విషయంపై కలెక్టరుకు, ఎంఆర్ఓకు ఫిర్యాదు చేయడం జరిగింది. గతంలో కూడా 33/4లోని 0.23 సెంట్ల భూమిలో ఇంజంక్షన్ ఆర్డర్‌కు ముందు యజమాని అయిన రమణయ్య నుంచి 84.66 చదరపు గజాల భూమిని రిజిస్ట్రేషన్ పత్రం 139/2025 ద్వారా శ్రీజ కొనుగోలు చేసినప్పటికీ ఆ భూమిని మళ్లీ తన భార్య అయిన సుగుణమ్మ పేరుపై తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయబడింది. సంబంధిత అధికారులు ఈ విషయంపై వెంటనే దర్యాప్తు చేసి అక్రమ చర్యలపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది.

'ఫ్రైడే డ్రైడే'తో దోమల నియంత్రణ సాధ్యం

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 24 , ప్రభాతవార్త

దోమల నియంత్రణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి. నరసింహా రెడ్డి పేర్కొన్నారు. బద్వేల్ మండలం ఎతిరాజుపల్లెలో శుక్రవారం నిర్వహించిన 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి బానలు, ఫ్రిజ్‌లు, నీటి డ్రమ్ములు, పాత టైర్లు, కూలర్లు తదితర చోట్ల నీరు నిల్వ ఉండకుండా పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి అధిక ఖర్చులు చేయకుండా ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. నరసింహా రెడ్డి మాట్లాడుతూ, దోమల వల్ల వచ్చే మలేరియా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దోమతెరలు వినియోగించడం ఉత్తమమని చెప్పారు. ఏవైనా లక్షణాలు కనిపించిన వెంటనే 104 సేవలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సంప్రదించాలని సూచించారు. అవగాహనలో భాగంగా దోమలపై హాస్య గీతాన్ని పాడి ప్రజలను అలరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్ రావు, ఏఎన్ఎం మహాలక్ష్మి, వైద్య సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వృథా అరికట్టి పొదుపు దిశగా అడుగులు

నందలూరు, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:

విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం వహించకుండా వృథాను అరికట్టి, పొదుపు దిశగా ప్రతి వినియోగదారు ముందుకు రావాలని ఏపీ ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ సూచించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లిలో నిర్వహించిన "కరెంట్ జనబాట" కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. విద్యుత్ సరఫరా నాణ్యత, వోల్టేజ్ స్థితి, ఎదురవుతున్న ఇబ్బందులపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జనబాట కార్యక్రమం వేదికగా నిలుస్తోందని తెలిపారు. విద్యుత్ వినియోగంపై అవగాహన పెంపుతో పాటు, వృథా నియంత్రణ అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. అదనంగా, పీఎం సూర్యఘర్ సోలార్ పథకం ద్వారా ప్రతి ఇంటిలో సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గడమే కాకుండా, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించే అవకాశమూ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట డీఈఈ సుబ్రహ్మణ్యం, నందలూరు ఇన్‌చార్జి ఏఈ ఏకాంబరం బాబు, నాగిరెడ్డిపల్లి జేఎల్ఎం మోడపోతుల రాజా, లైన్‌మెన్‌లు శ్రీనివాసులు, కిరణ్, చంద్ర, సుబ్రహ్మణ్యం, చెన్నారెడ్డి, ఏఎల్ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగాభవాని అమ్మవారికి కుంకుమార్చన

సిద్ధవటం ఏప్రిల్ 24 ప్రభాతవార్త

మాధవరం 1 పంచాయతీ బంగారు పేటలోని శ్రీ గంగాభవాని అమ్మవారి 34 వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఫ్యామిలీ ట్రస్ట్ అధ్యక్షుడు మాడా పెద్ద సుబ్బరాయుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం గణపతి పూజ, స్వస్తివాచనము మాతృకా పూజ ఆచార్యాది ఋత్విక్ వరణము, రక్షాబంధనము పంచగవ్య ప్రాశనము నవగ్రహ వాస్తు సర్వతోభద్ర మండల ఆరాధనలు అష్టోత్తర శత కలశాభిషేకం అర్చనమంగళహారతి మంత్ర పుష్పం మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన పూజ ఖిలక్ష కుంకుమార్చనఖి పుణ్య స్త్రీ వ్రతం అనంతరం పూజలో పాల్గొన్న పుణ్యస్త్రీలందరికి అమ్మవారి ప్రసాదంగా మంగళప్రదమైన గాజులు,పసుపు కుంకుమలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి పాల్గొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఇంటర్ సెకండియర్‌లో టౌన్ టాపర్‌గా నిలిచిన మెంట బాలాజీని అభినందించిన మున్సిపల్ మాజీ చైర్మన్

10,000 నగదు ప్రోత్సాహం

వస్త్రాలు అందజేస్తూ అభినందించిన టీ.వీ శివనారాయణ

బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన ఇంటర్మీడియట్ సెకండియర్ ఫలితాలలో బద్వేల్ పట్టణంలోని గౌతమ్ జూనియర్ కళాశాలలో చదివిన మెంటా బాలాజీ 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించి టౌన్ టాపర్ గా నిలిచారు, విషయం తెలుసుకున్న బోవిల్ల వారి పల్లె గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి వారి తండ్రి కీర్తిశేషులు సానపురెడ్డి గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం ఇంటర్ ఫలితాలలో బద్వేల్ టౌన్ టాపర్ గా నిలిచిన మెంట బాలాజీని శుక్రవారం సాయంత్రం మాజీ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ ఇరువురు శాలువాతో సత్కరించి విద్యార్థిని అభినందించుతూ భవిష్యత్తులో ఇటువంటి ర్యాంకులు మరెన్నో సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు స్వీట్ తినిపించి వారిని అభినందించారు,అలాగే బాలాజీ ఇంతటి మార్కులు సాధించడానికి కృషిచేసిన గౌతమ్ జూనియర్ కళాశాల అధ్యాపక బృందానికి మరియు వారి తల్లిదండ్రులు మెంట సురేష్ బాబు సతీమణి నాగమణి కుమారుడు మెంట బాలాజీ కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి వైస్ చైర్మన్ వాళ్ళతో సత్కరించి వారిని అభినందించారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు సత్య టౌన్షిప్ అధినేత సముద్రాల సుబ్బారావు (గురు) రాచపూడి వెంకటరత్నం, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, విద్యావేత్త సివి నాగేశ్వరరావు, పబ్బతి సత్యనారాయణ, తుమ్మలపెంట సురేష్ బాబు, యల్లనూరు వెంకటరమణ, ప్రత్నాప సాయి తోపాటు పలువురు పాల్గొన్నారు.

శివుని నగల మాయం పై సమగ్ర విచారణ జరపి బాధ్యులను శిక్షించాలి

ప్రొద్దుటూరు ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీ ఆగేస్తేశ్వర స్వామి నగల మాయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని దేవాలయాల సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పుష్పాల శ్రీనాథ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఈ విషయమై స్థానిక బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ అగస్తేశ్వరాలయంలో అమ్మవారి ఆభరణలతో పాటు వెండి నగలు మరియు సుమారు కోటి రూపాయల నగదు మాయమైన సంఘటనలో ఎండోమెంట్ శాఖ అధికారులు దోషులను గుర్తించడంలో జాప్యం చేస్తుండటం సరికాదన్నారు. ముఖ్యంగా గతంలో ఈఓ లుగా పనిచేసిన శంకర బాలాజీ, రామచంద్రా చార్యుల హయాంలో ఈ అక్రమాలు జంగాయని ప్రస్తుత ఆలయ ఛైర్మన్, పూజారులతో పాటు భక్తులందరూ ఆరోపిస్తున్నప్పటికి అధికారులు మాత్రం కంటి తుడుపు చర్యగా నామ మాత్రపు విచారణ జరిపి చేతులు దులుపుకోవాలని చూస్తుండటం చాలా దుర్మార్గమని వివరించారు. కావున భక్తుల మనో భావాలను గౌరవించి శ్రీ అగస్తేశ్వరాలయంలో బంగారు, వెండి నగలతో పాటు దాదాపు రూ.కోటి మాయమైన సంఘటనలో బాధ్యులుగా భావిస్తున్న శంకర బాలాజీ, రామచంద్రాచార్యులపై సమగ్ర విచారణ జలిపించి 10 రోజులలోగా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేవాలయాల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళనకు దిగవలని వస్తుందని రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ 1వ పట్టణాధ్యక్షులు వంకదార నరేంద్ర రావు, నాయకులు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, హరికృష్ణ, శివ నాగిరెడ్డి, వెంకట్, రెడ్డయ్య, జనసేన నాయకులు మాదాసు మురళీ, బాబ్జీ, బొల్లవరం వెంకటేశ్వర స్వామి దేవాలయం పాలకమండలి సభ్యులు రామోజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవం

మైదుకూరు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:

జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం నందు శ్రీ స్వాములవారికి 333వ ఆరాధన గురు పూజ మహోత్సవాలు జరుగుతున్నందున కడప జిల్లా మైదుకూరు పట్టణ వనిపెంట రోడ్డు బ్రహ్మంగారి గుడి ఆశ్రమం నందు దీక్షలు చేపట్టిన బ్రహ్మంగారి భక్తులు శుక్రవారం బ్రహ్మంగారి ఆశ్రమం నుండి రథంపై గ్రామోత్సవంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దర్శనమిచ్చారు. స్వామి వారికి దారి పొడవునా వీరబ్రహ్మేంద్రస్వామి పాటలతో దారి పొడుగునా చెక్కభజన, దీక్ష చేపట్టిన భక్తులు, పట్టణ ప్రజలకు ప్రసాదాన్ని అందిస్తూ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టణ ప్రజలకు దర్శనమిచ్చేలా చేయడం వల్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. స్వామివారిని భక్తిశ్రద్ధలతో మొక్కి కుంకుమ నుదుటిన ధరించి స్వామివారికి కుటుంబ సభ్యులతో కాయ కర్పూరం సమర్పించారు.శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గ్రామోత్సవంలో దారి పొడవున భక్తులు స్వామి వారి వెంట నడిచి అందరికీ దర్శనం ఇచ్చేలా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా దారి పొడవునా బిజెపి జిల్లా నాయకులు మైదుకూరు పట్టణ మాచనూరు సుబ్బరాయుడు నడుస్తూ కార్యక్రమాలను చూసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి నాయకుడు మాచనూరు సుబ్బారాయుడు, రామక్రిష్ణ , పుల్లయ్య, పీరయ్య, కార్యనిర్వక్కులు భక్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

30న ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్‌ను విజయవంతం చేయాలి

కడప, ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

ఈ నెల 30వ తేదీన కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిసరాల్లోని అదీప్ ల్యాబొరేటరీ యూనిట్ లో నిర్వహిస్తున్న ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ చేపట్టి విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి డిఆర్వో వెంకటపతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా విపత్తుల నిర్వహపై సంబందిత జిల్లా అధికారులతో జిల్లా నించార్జి రెవెన్యూ అధికారి సమీక్షా సమావేశం నిర్వహింహించార్ ఈ సందర్భంగా ఇన్చార్జి డిఆర్వో మాట్లాడుతూ వై.ఎస్.ఆర్ కడప జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల నిర్వహణ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఈ నెల 30వ తేదీన ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ నిర్వహించబనున్నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ప్రక్రియ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (NDMA) మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని కొప్పర్తి పరిశ్రమల ప్రాంతంలో ఉన్న అడీప్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు సమీపంలోని పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మాక్ డ్రిల్ ప్రక్రియలో భాగంగా అగ్ని ప్రమాదం, ప్రమాదకర రసాయనాల లీకేజీ వంటి అత్యవసర పరిస్థితులను మోడల్ రూపంలో ప్రదర్శించి, సంబంధిత విభాగాల సమన్వయాన్ని పరీక్షించనున్నారన్నారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పరిశ్రమల ప్రతినిధులు కలిసి స్పందన చర్యలను అమలు చేస్తున్నారన్నారు. మాక్ డ్రిల్ సమయంలో కొప్పర్తి పరిసర ప్రాంతాల్లో భద్రతా కారణాల రీత్యా కొన్ని పరిమితులు అమలులో ఉంటాయన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, అధికారుల సూచనలను పాటిస్తూ ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ మాక్ డ్రిల్ పూర్తిగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగమే అని ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ విన్యాసానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ చీఫ్ చిన్నారావ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, విద్యుత్, ఫైర్, ఆర్టీవో, వ్యవసాయ అనుబంధ శాఖలు తదితరులు పాల్గొన్నారు.

దాసరి పల్లెలో పోలీస్ పికెటింగ్

దువ్వూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

మూడు రోజుల క్రితం దాసరిపల్లె గ్రామంలో గట్టు విషయంలో జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి ఒక వ్యక్తి గాయపడి మరణించడంతో గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. శుక్రవారం మరణించిన వ్యక్తి శ్రీనివాసులుకు అంత్యక్రియలు పూర్తి కావడంతో గ్రామంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. తదనంతరం కూడా పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తామని తెలిపారు. ప్రస్తుతం దాసరి పల్లె గ్రామంలో సుమారు 20 మంది పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

వడదెబ్బపై అన్నమాచార్య విద్యార్థుల కరపత్రాల ప్రచారం

వడదెబ్బపై కరపత్రాలతో ప్రచారానికి విద్యార్థులు

రాజంపేట, ఏప్రిల్ 24 ప్రభాతవా

మండలంలోని బోయినపల్లి గ్రామంలో వడదెబ్బ నివారణపై అన్నమాచార్య యూనివర్సిటీకి చెందిన కాలేజ్ ఆఫ్ అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగంలోని బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బి.ఎస్‌సి మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ విద్యార్థులు బోయినపల్లి గ్రామంలో వడదెబ్బ (సన్‌స్ట్రోక్) నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గ్రామ ప్రజలకు వడదెబ్బ వల్ల కలిగే ప్రమాదాలు, నివారణ చర్యలు, డీహైడ్రేషన్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా తెలియజేశారు. అలాగే ప్రజలకు అవగాహన పత్రాలు పంపిణీ చేసి, వేసవి కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకునే విధానాలపై వివరించారు. ఎక్కువగా నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించడం వంటి సూచనలు చేశారు.గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చి, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన ప్రాథమిక చికిత్స చర్యలను కూడా ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు కృషి చేశారు.ఈ కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అన్నమాచార్య యూనివర్సిటీ వీసీ డా. ఈ. సాయిబాబారెడ్డి, ఆఫీసర్ ఇన్‌చార్జ్ పి. ద్వారకానాథ రెడ్డి , ఫ్యాకల్టీ సభ్యులు సి. మీనాకుమారి, ఎం. కవిత, జి. గిరిప్రియా పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ ఇంటర్నేషనల్ 40వ ఆవిర్భవ సంబరాలు

రాజంపేట ఏప్రిల్ 24 ప్రభాతవార్త :

రాజంపేట క్రీడా మైదానంలో శుక్రవారం వాకర్స్ ఇంటర్నేషనల్ 40వ ఆవిర్భావ సంబరాలు వాకర్స్ ఇంటర్నేషనల్ మ్యాగ్జైన్ ఎడిటర్ కొండూరు శరత్ కుమార్ రాజు, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కొండూరు శరత్ కుమార్ రాజు మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ స్థాపించి 40సంవత్సరాలు పూరతైనా సందర్బంగా వాకర్స్ ఇంటర్నేషనల్ లోగోను ఆవిష్కరించారు. ఆరోగ్యమే మహాభాగ్యమన్న మహానుబావుల మాటను నిజం చేస్తూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే నడక ప్రధానమన్నారు.40సంవత్సరాల క్రితం వైజాగ్ బీచ్‌లో అల్వర్ దాస్ స్థాపించి వాకర్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సభ్యులు స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళాలతో అనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక వాకర్స్ అసోసియేషన్ నుంచి ఒకే ఒక్క రోజు 108మందితో మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యత్వాలు నమోదు చేసి 10లక్షల 80,000 రూపాయలు నగదు ట్రస్ట్ కు అందజేసి ఒక రికార్డ్ సృష్టించిన ఘనత వాకర్స్ అసోసియేషన్ రాజంపేట సభ్యులకే చెందినది. అనంతరం క్రీడామైదానంలో నడుస్తున్న 400 మందికి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మజ్జిగ పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు కె. సుబ్బురామ రాజు, ట్రెజరర్ వెంకటయ్య నాయుడు,ఎంజీఫ్ సభ్యులు సుబ్బరాజు, రఘువీరారాజు, సుంకు సుధాకర్, మేడికొండు రవి నాయుడు, నాగరాజు గుప్తా, కొమ్మి రామచంద్ర నాయుడు దగ్గుపాటి రవి, కెఎంల్ నరసింహులు,గంగాధర్, సత్యం, శివరామ రాజు, డి. సుబ్బారాయుడు, శంకర్ రాజు, అరే వెంకట సుబ్బయ్య, జయచంద్ర రాజు,హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

అప్పుడే పాఠశాలల బలోపేతంకు అవకాశం, ఎస్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు రఘునాథ రెడ్డి

రాజంపేట, ఏప్రిల్ 24 ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు అత్యవసరమని ఎస్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు మల్లు రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్.టి.యు రాజంపేట ప్రాంతీయ ముఖ్య నాయకుల సమావేశం రీజియన్ కన్వీనర్ జి. పెంచలయ్య ఆధ్వర్యంలో ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు పేద, మధ్యతరగతి, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే ప్రధాన వేదికలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవలి కాలంలో నమోదు తగ్గడం ఆందోళనకరమన్నారు. విద్యలో సమాన అవకాశాలు సాధించాలంటే ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడం అనేది సమాజ భవిష్యత్తును నిర్మించే గొప్ప బాధ్యత అన్నారు.రాష్ట్ర నాయకులు వై.సుబ్రహ్మణ్యం రాజు, అశోక్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు .ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లోపం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ఎస్టీయూ కార్యకర్త ఇల్లు ఇల్లు తిరిగి ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేరేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంపు కోసం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.డిజిటల్ విద్యను బలోపేతం చేయాలన్నారు.ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే సమాజంలో విద్యా అసమానతలను తగ్గించవచ్చని ఎస్ టి యు నాయకులు స్పష్టం చేశారు. సమావేశంలో మురళీ మోహన్,బి రవిశంకర్‌రెడ్డి, ఎం ఓబులేసు, నరసింహ,సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు,స్వామినాథ్, మోహన్ రావు,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి

దువ్వూరులో డీజిల్, పెట్రోల్ కొరత

దువ్వూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో శుక్రవారం డీజిల్, పెట్రోల్ కొరత స్పష్టంగా కనిపించింది. దువ్వూరు చుట్టు ప్రక్కల సుమారు 5 పెట్రోల్ బంకులు ఉండగా ఐదు బంకుల్లో కూడా డీజిల్, పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఒక పెట్రోల్ బంకులో కొద్దిగా మాత్రమే డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉండడంతో అక్కడ ఎక్కువ మంది వాహనదారులు వెళ్లి క్యూలో నిలబడ్డారు. ఏది ఏమైనా మండల కేంద్రమైన దువ్వూరులోని పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొరత స్పష్టంగా కనిపిస్తోంది. పై నుంచి సరఫరా ఆగిపోవడంతోనే తమ వద్ద డీజిల్, పెట్రోల్ లేదని అందువల్ల నో స్టాక్ బోర్డులు ఉంచుతున్నామని బంకు యజమానులు తెలిపారు. స్టాక్ వచ్చిన వెంటనే పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం

యర్రగుంట్ల ఏప్రిల్ 24, ప్రభాతవార్త:

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని యర్రగుంట్ల మండల పరిధిలో గల చిలంకూరు గ్రామపంచాయతీ కార్యాలయం నందు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వెంకటరమణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణయ్య మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో పంచాయతీ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పరం చేయడం మానుకోవాలి డా.తులసిరెడ్డి

వేంపల్లె:ఏప్రిల్ 24 ప్రభాతవార్త

ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేట్ పరం చేయడం మానుకోవాలని కూటమి ప్రభుత్వానికి ఏపిసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ పరం చేయడం ద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు. సంబంధిత ఆసుపత్రుల్లో రోగులు ఉచిత వైద్యానికి నోచుకోరని వెల్లడించారు. మాజీ సిఎం ఎన్టీఆర్ ఆ విధానానికి వ్యతిరేకమన్నారు. వీటి నిర్వహణకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని ఏపి సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు కేవలం సాకు మాత్రమే అన్నారు. అలాగే వీటి నిర్వహణ బాధ్యత ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే నిర్ణయం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

రెహానా మృతికి కారకుడైన షాజహాన్ను వెంటనే ఉరితీయాలి

పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 24 ప్రభాత వార్త :

పోరుమామిళ్లలోని సిఐటియు కార్యాలయం వద్ద మహిళాసంఘం (ఐద్వా సంఘం) మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయని, ప్రేమ పేరుతో ఆడపిల్లలపై దుర్మారంగా హత్యలు జరుగుతున్నాయని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం (ఐద్వాసంఘం) మండల కార్యదర్శి షేక్. గౌసియాభేగం మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి, కూటమి ప్రభుత్వాలు మహిళలకు 33 కావాలని గందరగోళం చేయడం తప్ప మహిళలపై గౌరవం లేదని వారన్నారు. ప్రేమవ్యవహారాలలో దుర్మార్గంగా మహిళలు పైన అత్యాచారాలు, మానభంగాలు చేసి చంపుతున్నారన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా నాకు ప్రేమ వ్యవహారం ఉందని చంపడం జరుగుతుందన్నారు. మొన్నటి రోజున కడప నగరం నడిబొడ్డులోని పటేల్ నగర్ లోని రెహానా 26 సంవత్సరాల అమ్మాయికి ప్రొద్దుటూరుకు చెందిన షాజహాన్ తో నిశ్చితార్థం జరిగిందన్నారు. నిశ్చితార్థం జరిగిన నాలుగు రోజుల నుంచి చరవాణి లో నాకు వేరే అమ్మాయిలతో సంబంధాలు ఉన్నాయని నువ్వంటే నాకు ఇష్టం లేదని రెహానా ను మానసికంగా భయాందోళనలకు గురి చేయడంతో మనస్థాపం చెంది ఆమె ఉరి వేసుకుని చనిపోవడం జరిగిందన్నారు. ఇలాంటి షాజహాన్ లాంటి వారిని వెంటనే ప్రభుత్వము నడిరోడ్డు పైన కాల్చి చంపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజీపేట లో కీర్తన, గండిపేటలో వైష్ణవి ఆడపిల్లలను ఘోరంగా చంపడం జరిగిందన్నారు. ఇలాంటి దుర్మార్గులను మరణశిక్ష వేసి కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వేంపల్లి మండలానికి హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడిగా దివాకర్ రెడ్డి నియామకం

వేంపల్లి : ఏప్రిల్ 24 ప్రభాతవార్త

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ వేంపల్లి మండల అధ్యక్షుడిగా వల్లూరు దివాకర్ రెడ్డిని నియమించారు. జాతీయ అధ్యక్షుడు నందం నరసింహా రావు ఆదేశాల మేరకు, కడప జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, పేదలు మరియు బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలపై కఠినంగా పోరాడతానని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. అక్రమాలు, అవినీతి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ, బాధితులకు న్యాయం చేయడం తన ప్రధాన లక్ష్యమన్నారు.